క్లుప్తంగా

నగర సమస్యలపై సీపీఎం ధర్నా



నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బోట్‌క్లబ్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ తమ పార్టీ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేశామని, పారిశుధ్యం, చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడం వల్ల దోమలు ఎక్కువై ప్రజలు అవస్థ పడుతున్నారని వివరించారు. సామాన్యులకు సొంతిళ్లు, టిడ్కో నిర్మాణాలు పూర్తి, స్థలం ఉన్న వారికి గృహ రుణాల మంజూరు, వేసవిలో తాగునీటి కొరత తదితర సమస్యలపై అదనపు కమిషనర్ సుధాకర్‌కు సమర్పించామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు మలక వెంకట, నాగాబత్తుల సూర్యనారాయణ, ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, వెంకట్రావు, కె.సత్తిబాబు, భూలక్ష్మి, భారతి, సత్యానందం, సుధాకర్, సత్యనారాయణ, సురేష్, విజయ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బాబూరావు

కరప: ఆరోగ్యవంతమైన పంటలను అందించేందుకు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా మండల మహిళా సమాఖ్య వీఓఏలు, వ్యవసాయశాఖ వీపీఏలు, ఏఈఓలు రైతులను చైతన్యపరచాలని సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఏపీసీఎన్ఎఫ్ క్యాడర్ ఆధ్వర్యంలో వివిధ శాఖలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిసాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులను సాధించేందుకు ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై వివిధ శాఖల ప్రతినిధులతో చర్చించారు. ఎంటీలు సన్యాసినాయుడు, ధనలక్ష్మి, ఏఈఓలు శ్రీరాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చాగంటి సత్సంగం కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో బ్రహ్మశ్రీ చాగంటి దంపతులు

కాకినాడ రూరల్: ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు నేతృత్వంలో పనిచేసే చాగంటి సత్సంగం నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. తిమ్మాపురంలోని ఆకొండి లక్ష్మి స్మారక గోశాలలో చాగంటి సమక్షంలో కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2025–27 కాలానికి ఈ కార్యవర్గం సేవలందించనుంది. అధ్యక్షుడిగా ఐ.సూర్యనారాయణమూర్తి, కార్యదర్శిగా డీవీవీ రాజు, సభ్యులుగా ఐ.లక్ష్మీ నారాయణమ్మ, ఎస్.సుగుణ, కె.హిమబిందు, బి.మాధవి, సీహెచ్ మాధవరాజు, సీహెచ్ శ్రీలక్ష్మి, ఎస్.వెంకట రాజేష్, ఎస్.సత్యనారాయణ నియమితులయ్యారు.

పోక్సోపై అవగాహన అవసరం

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి కిరణ్ కంటి ఆస్పత్రి వద్ద సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్వతి విద్యాలయం విద్యార్థులకు పోక్సో చట్టం, దాని ద్వారా లభించే రక్షణ గురించి రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.విజయబాబు బుధవారం అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తిమ్మాపురం పోలీసులు సహకారంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులలో జడ్జి విజయబాబు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించి, జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఎస్‌హెచ్‌ఓ సుస్మిత, ఎస్సై ఆర్‌వీఎన్ మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ ప్రారంభం

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. సర్పవరంలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు పోషణ్ భీ – పఢాయి భీపై మూడు శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మార్తమ్మ, రాజేశ్వరి, సింహచలం, పద్మశ్రీ, విజయలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో 15వ సారి



నా పేరు చక్ర అనూష. మాది కిర్లంపూడి. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇప్పటి వరకు 14 సార్లు నేషనల్స్‌లో ఆడాను. నాది డిఫెన్స్ స్థానం. క్రీడల్లో రాణించి రైల్వేలో ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. ఖోఖో కోచ్ వాసు వద్ద శిక్షణ పొందుతున్నాను.

ఐపీఎస్ లక్ష్యం



నా పేరు హేమవతి. మాది ప్రకాశం జిల్లా. బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్నా. ఏడేళ్లుగా ఖోఖో ఆడుతున్నాను. పాఠశాలలో సీనియర్స్ ఖోఖో ఆడడం చూసి ఆకర్షితురాలినయ్యాను. మాది వ్యవసాయ కుటుంబం. ప్రకాశం జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథ రెడ్డి నాకు టోర్నీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం అందిస్తారు. క్రీడల్లో రాణించి ఐపీఎస్ కావడం లక్ష్యం. జాతీయ స్థాయిలో పతకం కోసం శ్రమిస్తున్నాం.

ఇండియాకు ఆడాలి



నా పేరు కె.కుమారి. మాది కృష్ణాజిల్లా. మా నాన్న ఆటో డ్రైవర్. 2012 నుంచి ఖోఖో ఆడుతున్నాను. ఈ ఏడాది వరల్డ్ కప్ శిబిరానికి ఎంపికై శిక్షణ పొందాను. బీపీఈడీ పూర్తి చేశాను. ఖోఖోలో ఇండియాకు ఆడడం నా లక్ష్యం. ప్రతి రోజు ఉదయం 3 గంటలు, సాయంత్రం 3 గంటలు సాధన చేస్తాను.

ఖో.. పసిడి పట్టుఖో..

- జాతీయ చాంప్ లక్ష్యంగా సాధన
- ముమ్మరంగా కృషి చేస్తున్న రాష్ట్ర జట్టు
- డీఎస్ఏలో రేపటి వరకు శిబిరం
- 31 నుంచి ఏప్రియల్ 4 వరకు పూరీలో పోటీలు
- ఉమ్మడి 'తూర్పు' నుంచి ఇద్దరికి స్థానం



డీఎస్ఏలో జరుగుతున్న రాష్ట్రస్థాయి శిబిరంలో సాగుతున్న ఫిట్‌నెస్ వ్యాయామాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వారంతా నిరుపేద కుటుంబాల వారే. చదివేది సర్కారీ కళాశాలల్లోనే. గ్రామీణ క్రీడల్లో ఒకటైన ఖోఖో వారి ఊపిరి. పదేళ్లుగా సాధన చేసి ఈ నెలాఖరున పూరీలో ప్రారంభం కానున్న జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్లుగా నిలవాలని లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్ర ఖోఖో సంఘం సహకారంతో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ ఖోఖో శిబిరంలో ముమ్మర సాధన చేస్తున్నారు. వారి సాధన, లక్ష్యాలను బుధవారం సాక్షితో పంచుకున్నారు.

ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జాతీయ స్థాయి సీనియర్స్ మహిళల ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు బాపట్ల జిల్లా జె.పాంగులూరులో ఈ నెల 16న రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది హాజరుకాగా 15 మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామ రెడ్డి వీరికి ఈ నెల 22 నుంచి 28 వరకు స్థానిక డీఎస్ఏలో రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో ఉమ్మడి తుర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి పట్టాభి, ఖోఖో కోచ్ వాసు ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు ఉచిత, భోజన సదుపాయాలు కల్పించి శిక్షణ అందిస్తున్నారు. ఫిట్‌నెస్‌తో పాటు టీం వర్క్, కోఆర్డినేషన్, టిక్‌ట్యాక్ టెక్నిక్స్, స్కిల్స్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి అనుష, నందిని ఈ జట్టులో స్థానం దక్కించుకున్నారు. 2002లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు బంగారు పతకం సాధించింది. మళ్లీ ఈ ఏడాది స్వర్ణ పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్టు క్రీడాకారులు చెప్తున్నారు.



ఖోఖోలో మెళకువలు నేర్చుకుంటున్న క్రీడాకారిణులు

రాష్ట్ర జట్టు సభ్యులు వీరే

కె.రమ్య (నెల్లూరు), పి.చెక్ర అనూష (తూర్పు), టి.అనిత (పశ్చిమ), హేమ (విశాఖ), శివనాగలక్ష్మి (ప్రకాశం), కుమారి (తూర్పు), దివ్యశ్రీ (ప్రకాశం), పావని (ప్రకాశం), బి.మౌనిక (కృష్ణా), ఇ.హేమవతి(ప్రకాశం), భార్గవి (నెల్లూరు), శ్రావణి (విజయనగరం), నందిని (కాకినాడ), మునిలక్ష్మి (చిత్తూరు), వైష్ణవి (గుడివాడ).

జాతీయ స్థాయిలో పతకం ఖాయం



ఈ ఏడాది జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహిస్తున్నాను. డీఎస్ఏలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి శిబిరంలో మెరుగైన శిక్షణ అందిస్తున్నాను. తమ జట్టు కచ్చితంగా పతకం సాధిస్తుంది.

– ఖోఖో కోచ్ వాసు

సొంత ఖర్చులతో శిబిరం



రాష్ట్రస్థాయి శిబిరం తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించిన రాష్ట్ర అసోసియేషన్‌కు కృతజ్ఞతలు. ఈ శిబిరంలో 15 మంది శిక్షణ పొందుతున్నారు. ఉచిత భోజన, వసతి కల్పించాం. పోటీలకు హాజరయ్యే వారికి స్పోర్ట్స్ కిట్ అందిస్తాం. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో శిబిరాన్ని ఏర్పాటు చేశాం.

– పట్టాభి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి

మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుల నియామకం



నురుకుర్తి రామకృష్ణ



చింతా ఈశ్వరరావు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని రెండు మండల పార్టీ అధ్యక్షులను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. కాకినాడ రూరల్ మండలానికి జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ (కిట్టు), కరప మండలానికి సీనియర్ నాయకుడు చింతా ఈశ్వరరావు నిమమితులయ్యారు. గతంలోనూ వీరే మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. తమను మండల పార్టీ అధ్యక్షులుగా నియమించడానికి సహకరించిన పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటరు, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

రేపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కాకినాడ సిటీ: స్థానిక ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా ప్రభుత్వం తరపున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ముస్లిం పెద్దలు జిల్లా అధికారులు ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

పీఏసీఎస్ కంప్యూటరీకరణ

ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

కరప: స్థానిక పీఏసీఎస్ కార్యాలయాన్ని కంప్యూటరీకరించామని, దీనివల్ల సంఘం కార్యకలాపాలలో అవకతవకలకు ఆస్కారం ఉండదని సంఘం ప్రత్యేకాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యాలయంలో బుధవారం జరిగిన మహాజనసభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ పీఏసీఎస్ మూడో స్థానంలో ఉందని, సొసైటీ పరిధిలో 1409 మంది సభ్యులుగా ఉండగా, రూ.5.99 కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.12.73 లక్షలు లాభాలు వచ్చాయని, ఈ ఏడాది కూడా లాభాల్లోనే ఉందని తెలిపారు. ఇన్‌చార్జి సీఈఓ రాయుడు వెంకటేశ్వరరావు గత ఏడాది సంఘం జమా ఖర్చులు, 2025–26 సంవత్సరం అంచనా బడ్జెట్ చదివి వినిపించారు. వాయిదా మీరిన బకాయిదారుల పేర్లు చదివి వినిపించారు. వీటితోపాటు పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సిబ్బంది జీత భత్యాలు పెంచేందుకు, కొత్త సభ్యులకు పంట రుణాలు ఇచ్చేందుకు, అసంపూర్తిగా ఉన్న ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్చించి సభ్యుల ఆమోదంకోసం తీర్మానాలు చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, కరప డీసీసీబీ బ్రాంచ్ సూపర్‌వైజర్ డి.దత్తేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సంఘం కార్యకలాపాలను వివరిస్తున్న ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

నేడు కాకినాడ రూరల్ ఎంపీపీ ఎన్నిక

- ఎంపీపీ పద్మజ రాజీనామాతో స్థానం ఖాళీ
- పీఓగా డ్వామా పీడీ వెంకటలక్ష్మి
- పీఠం కోసం జనసేన కుయుక్తులు

కాకినాడ రూరల్: ఎంపీపీ ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పీఓగా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి వ్యవహరించనున్నారు. మండల పరిషత్ సమావేశపు మందిరం వేదికగా ఉదయం పది గంటలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11 గంటలకు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి తమ మద్దతు తెలిపి అధ్యక్షురాలిని ఎన్నుకోనున్నారు. కాకినాడ రూరల్ ఎంపీపీ జనరల్ మహిళకు రిజర్వు కావడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021 సెప్టెంబరులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం 18 మంది ఎంపీటీసీలకు 15 మందిని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. జనసేన మూడు గెలిచింది. అప్పట్లో ఎంపీపీగా కొవ్వాడ ఎంపీటీసీ గోపుశెట్టి పద్మజ ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ నుంచి సర్పవరం ఎంపీటీసీ పుల్ల వెంకటలక్ష్మి కూడా ఆ పదవికి పోటీ పడడంతో అప్పటి మంత్రి కురసాల కన్నబాబు రెండున్నరేళ్లు పద్మజ, తరువాత వెంకటలక్ష్మి చేసేలా జెంటిల్మెన్ ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు పద్మజ రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కలువుదీరడంతో ఎంపీపీ పదవి ఖాళీగా ఉంది. ఈలోగా వైస్ ఎంపీపీ బందిలి విరీష ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగారు. తాజాగా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎంపీపీ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు.



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయం

ప్రలోభాల వల

రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలో ఉండడంతో స్థానిక సంస్థల్లో పట్టు లేకపోయినా వైఎస్సార్ సీపీ సభ్యులను తమ వైపు తిప్పుకుని దొడ్డిదారి రాజకీయాలకు తెర తీశారు. కాకినాడ రూరల్‌లో జనసేన సూర్యారావుపేట1, 2, పండూరు 1 మాత్రమే గెలుచుకుంది. వీరిలో పండూరు 1 ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మికి ఎంపీపీ పీఠం కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అధికారంలో ఉండడంతో ప్రలోభాలు వల విసరడంతో వైఎస్సార్ సీపీకి చెందిన ఏడుగురు సభ్యులు జనసేన కండువాలు కప్పుకున్నారు. దీంతో వారి సంఖ్య పదికి చేరింది. మొత్తం 18 ఎంపీటీసీలలో మెజార్టీ సభ్యులు ఎవరిని ఎన్నుకుంటే వారు విజయం సాధించే అవకాశం ఉంది.

కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

బోట్‌క్లబ్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో వాడకట్టు రామారావు రాంజీ రూ.13 లక్షలతో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఆయన తల్లితండ్రులు వాడకట్టు రూకాజీ, వెంకటకుమారి దంపతుల పేరిట దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమని రోటరీ గవర్నర్ కల్యాన్‌చక్రవర్తి అన్నారు. బిల్డింగ్ ప్రాజెక్టు చైర్మన్ బోడా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రోటరీ మల్టీపర్పస్ బిల్డింగ్ ద్వారా 5 ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాలకు క్లబ్ సభ్యుడు హరిబాబు రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించగా, పైడా వేంకటేశ్వరరావు పైడాస్ అభయా ఫౌండేషన్ తరపున కంప్యూటర్ ట్రైనింగ్‌సెంటర్‌కు ప్రతి నెల రూ.25 వేలు ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా పైడా వేంకటేశ్వరావు, వాడకట్టు నూకాజీ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ సీతాపతిరావు, క్లబ్ సెక్రటరీ పోలిశెట్టి ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



దాతలు వాడకట్టు నూకాజీ, వెంకటకుమారి దంపతులను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం సహించం

ప్రైవేటు విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు ఎంవీఐ హెచ్చరిక

పెద్దాపురం: విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎంవీఐ కె.ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పెద్దాపురం, కిర్లంపూడి, ఏలేశ్వరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల పరిధిలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమన్యాలు, డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తమ బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. అనుభవం కలిగిన డ్రైవర్లకే బాధ్యత అప్పగించాలన్నారు. ఇటీవల డివిజన్ పరిధిలో ప్రైవేట్ విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు చేశారన్నారు. వారికి కనీస రహదారి భద్రతా నియమాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

తరలనున్న తహసీల్దార్ కార్యాలయం

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద అసంపూర్తిగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ కార్యాలయం మార్చడానికి ఎమ్మెల్యే చినరాజప్ప సూచన మేరకు కలెక్టరు అంగీకరించినట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ మేరకు భవనం మరమ్మతులకు అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం ఐసీడీఎస్ భవనాన్ని తహసీల్దార్ పరిశీలించారు. భారీ వర్షాలు వచ్చిన సమయంలో ప్రస్తుత కార్యాలయంలో రికార్డులు తడిసి ముద్ద అవుతున్న విషయాన్ని సాక్షి ప్రచురించడంతో తహసీల్దార్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

నవోదయకు పెదకొత్తూరు విద్యార్థి



ప్రవీణ్ సంతోష్

కరప: పెదకొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి జల్లి ప్రవీణ్ సంతోష్ జవహర్ నవోదయకు ఎంపికై ఆరో తరగతిలో చేరనున్నట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి ప్రవీణ్‌సంతోష్, తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు ఈ.అర్జున్, ఎస్‌వీఎస్ఎస్ రామకృష్ణలను, విద్యార్థి తల్లిదండ్రులు జల్లి శ్రీనివాస్, వరలక్ష్మి దంపతులను ఎంఈఓలు అభినందించి సత్కరించారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మి, పేరెంట్ కమిటీ చైర్మన్ ఇజ్జన సావిత్రి, చింతా బుజ్జి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



సందర్శకులకు మజ్జిగ అందజేస్తున్న ఏఓ, సిబ్బంది

కరప: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఏఓ(సూపరింటెండెంట్) బీఎల్ నరసింహం చలివేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా అధికారుల సూచనల మేరకు దీనిని నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మండల ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, టి.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పిఠాపురం: పట్టణంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం రోడ్డుపై యాచకవృత్తి చేసుకుంటున్న వ్యక్తిని ఒక కారు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వివరాలు తెలియలేదని ఎవరికైనా తెలిస్తే పట్టణ ఎస్సై సెల్ నంబరు 94407 96560కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

చల్లంగ చూడమ్మా..



కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆలయం



అమ్మవారి గరగల ఉత్సవం (ఫైల్)



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

- నూకాలమ్మ జాతరకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- 45 రోజుల పాటు నిర్వహణ
- ఉగాది సందర్భంగా మూసివేత

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, మండలం కాండ్రకోటలో కొలువైన నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 28వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ ఉత్సవాలు సాగనున్నాయి.

జాతర ప్రస్థానం ఇదీ..

సుమారు 500 ఏళ్ల నుంచి నూకాలమ్మ జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అత్యంత నమ్మకంతో జాతరకు వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. 1950లో దేవాలయాన్ని దేవదాయ శాఖకు అప్పగించడంతో ఆనాటి నుంచి ఆలయ కమిటీ ఏర్పాటై ఏటా గరగల ఉత్సవం, జాతర మహోత్సవంతో పాటు 45 రోజుల పాటు తీరునాళ్లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే నెల 11వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలను ఆలయ ఈఓ. సౌజన్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 28వ తేదీ ఈ రోజు రాత్రి 8.46 నిమిషాలకు ప్రారంభమయ్యే జాతర ప్రారంభోత్సవానికి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 28వ తేదీ శుక్రవారం రాత్రికి అమ్మవారి జాతర. 29న అమ్మవారికి ఉయ్యాల సేవ, బద్ది నిర్మాణ మహోత్సవం, మహా నైవేద్యం చెల్లింపు. 30న ఉగాది సందర్భంగా సంప్రదాయం ప్రకారం ఆలయ తలుపులు మూసివేస్తారు. అమ్మవారి దర్శనం లభించదు. 31వ తేదీన అమ్మవారి ఆలయ తలుపులు తెరచి 42 రోజుల పాటు తిరునాళ్లు వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 31వ తేదీన ఉదయం బద్ది కడుగు మహోత్సవం నిర్వహిస్తారు.

ఆలయానికి దారిదీ..

పెద్దాపురం పట్టణానికి ఆరు కిలో మీటర్ల దూరంలో నూకాలమ్మ ఆలయం ఉంది. రాజమహేంద్రవరం నుంచి వచ్చే యాత్రికులు స్థానిక దర్గా సెంటర్ వద్ద బస్సు దిగగానే అక్కడ ప్రతి 10 నిమిషాలకు ఆటో ఉంటుంది. కాకినాడ నుంచి తామరాడ వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రతి గంటన్నరకు అందుబాటులో ఉంటుంది. రైలు మార్గం ద్వారా వచ్చే భక్తు లు సామర్లకోట జంక్షన్‌లో దిగి పెద్దా పురం దర్గా సెంటర్‌కు చేరుకోవాలి. అక్కడ నుంచి కాండ్రకోటకు ఆటోలు అందుబాటులో ఉంటాయి.

29న యండపల్లిలో..



నూకాలమ్మతల్లి

కొత్తపల్లి: యండపల్లి గ్రామంలోని నూకాలమ్మ తల్లి తీర్థాన్ని 29న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించారు. ఆలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సంవత్సరం అంతా చేతికందిన పంటను దేవుని వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యమాలు నిర్వహించారు.